క్లుప్తంగా

కాంగ్రెస్ పార్టీ న్యూఇయర్ క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మునగాల : మండలంలోని కలకోవలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమ కోసం ఉత్తమ్, పద్మావతి దంపతులు కృషి చేస్తున్నారని కొనియాడారు. కాంగ్రెస్, మండల గ్రామ శాఖ నాయకులు పాల్గొన్నారు.

సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

చిలుకూరు : సంగారెడ్డిలో ఈ నెల 29వ తేదీన జరిగే సీపీఎం రాష్ట్ర నాల్గొవ మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకులు కోరారు. బుధవారం మండలంలోని కొండాపురం గ్రామంలో మహాసభల పోస్టర్ ఆవిష్కరించారు. గ్రామంలో ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జె. నరసింహారావు, పార్టీ సీనియర్ నాయకులు వేనేపల్లి వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి నాగాటి రాములు, నాయకులు వేల్పుల వెంకన్న, యాదాల వీరస్వామి, కందుల శ్రీకాంత్, కోటేశ్వరరావు, జయరాజు, నందిపాటి సతీష్, రామలక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత


వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ మల్లేష్

కోదాడరూరల్ : రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత అని ట్రాఫిక్ ఎస్ఐ మల్లేష్ అన్నారు. బుధవారం కోదాడ పట్టణంలోని హుజూర్‌నగర్ రోడ్డులో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా సెల్‌ఫోన్ డ్రైవింగ్‌తో జరిగే ప్రమాదాలపై ఆయన వాహనదారులకు అవగాహన కల్పించి మాట్లాడారు. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ, అతివేగంగా డ్రైవింగ్ చేస్తూ వాహనాలను నడపవద్దని సూచించారు. ద్విచక్రవాహనదారులు డ్రైవింగ్ చేస్తున్నప్పుడు తప్పనిసరిగా హెల్మెంట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది, వాహనదారులు ఉన్నారు.

జాతీయ క్రీడాకారిణికి ఆర్థికసాయం


ఆర్థికసాయం అందజేస్తున్న గ్రామస్తులు

చిలుకూరు : మండల కేంద్రంలోని బాపూజీ శాఖ గ్రంథాలయంలో హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన నేషనల్ హ్యాండ్‌బాల్ క్రీడాకారిణి విద్యకు బుధవారం శివాలయం కమిటీ చైర్మన్ కైలాసపు ఏడుకొండలు రూ.5 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు సొందు మియా మాట్లాడుతూ.. జాతీయ క్రీడాకారిణి విద్యకు ప్రతిఒక్కరూ చేయూతనివ్వాలని కోరారు. కార్యక్రమంలో పీఈటీ అమరగాని వీరబాబు, కబడ్డీ మాజీ క్రీడాకారుడు అమరగాని లక్ష్మయ్య, ఉపాధ్యాయుడు కొండా వెంకయ్య, గ్రంథాలయం రిటైర్డ్ అధికారి మండవ వీరస్వామి, క్రీడాకారుడు సాయి, పిల్లుట్ల బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ ఎన్నిక


శ్రీనివాస్‌కు నియామకపత్రం అందజేస్తున్న ఇరుగు ప్రభు

మఠంపల్లి : మండలంలోని యాతవాకిళ్లలో ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ సమావేశం ఆ సంఘం మండల అధ్యక్షుడు ఇరుగు ప్రభు మాదిగ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కుర్రి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా కస్తాల సైదులు, ప్రధాన కార్యదర్శి క్రీస్తు రాజు, కార్యదర్శి మహేష్, సాంస్కృతిక కార్యదర్శిగా గోపి, సహాయ కార్యదర్శిగా బాల జోజిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నరేందర్, బాబు, వెంకన్న, నాగేశ్వరరావు, బాలరాజు, పీటర్, సైదులు, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

బెంబేలెత్తిస్తున్న వీధి కుక్కలు

- ఒంటరిగా వెళితే వెంటపడి దాడి చేస్తున్న శునకాలు
- ఇటీవల 20 మందికి పైగా గాయాలు
- మృతి చెందిన మూగజీవాలు

చిలుకూరు : మండలంలో వీధి కుక్కలు బెంబేలెత్తిస్తున్నాయి. గ్రామాల్లోని వీధుల్లో స్వైర విహారం చేస్తున్నాయి. గుంపులుగా తిరుగుతూ నడుచుకుంటూ వెళ్తున్న వారిపై దాడి చేస్తున్నాయి. ద్విచక్ర వాహనాల వెంటబడుతుండడంతో వారు అదుపు తప్పి కిందపడి గాయాలపాలవుతున్నారు. కుక్కల బెడదతో పిల్లలు బయటకు వెళ్లాలంటే భయపడుతున్నారు. ఇటీవల చిలుకూరు, బేతవోలు, చెన్నారిగూడెం, నారాయణపురం, రామాపురం, ఆర్లెగూడెం, దూదియాతండా తదితర గ్రామాల్లో 20 మందికి పైగానే ప్రజలకు కుక్క కాటుకు గురయ్యారు. వీరంతా చిలుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేయించుకున్నారు.

మూగజీవాలపై దాడి..

వీధి కుక్కలు గ్రామాల్లో మూగ జీవాలపై కూడా దాడి చేస్తున్నాయి. మంగళవారం చిలుకూరులో ఇంట్లో ఉన్న బర్రె దూడపై 10 కుక్కలు దాడి చేసి చంపాయి. ఇలాంటి ఘటనలు మండల వ్యాప్తంగా అనేకం చోటుచేసుకుంటున్నాయి. అంతేగాక రాత్రి సమయంలో చిలుకూరులోని కోదాడ- జడ్చర్ల ప్రధాన రహదారిపై కుక్కులు ద్విచక్ర వాహనాల వెంట బడుతున్నాయని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. చిలుకూరు నుంచి రామాపురం, సీతారాంపురం నుంచి నారాయణపురం, చిలుకూరు నుంచి దూదియాతండా రోడ్డులో కుక్కల బెడద ఎక్కువగా ఉందని ప్రజలు చెబుతున్నారు. గతంలో గ్రామ పంచాయతీ వారు వీధి కుక్కల నివారణకు చర్యలు చేపట్టేవారని, ప్రస్తుతం ఎవరూ పట్టించుకోవడం లేదని దీంతో కుక్కల బెడద ఎక్కువైందని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామాల్లో కుక్కల బెడదను నివారించాలని కోరుతున్నారు.


చెన్నారిగూడెంలోని ఓ వీధిలో గుంపుగా ఉన్న కుక్కలు

నివారణకు చర్యలు తీసుకుంటాం



గ్రామాల్లో కుక్కల బెడద ఉన్నమాట వాస్తవమే. ఈ విషయం మా దృష్టికి కూడా వచ్చింది. గ్రామాల్లో కుక్కల నివారణకు చర్యలు తీసుకుంటాం. కుక్కలకు యాంటి రేబిస్ వ్యాక్సిన్లు చేయించాం. ఈ విషయంపై ఉన్నతాధికారులతో మాట్లాడి పూర్తి స్థాయిలో సమస్య పరిష్కరిస్తాం.

– కె. గిరిబాబు, ఎంపీడీఓ, చిలుకూరు

అందుబాటులో వ్యాక్సిన్లు



చిలుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కుక్క కాటు నివారణకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్లు అందుబాటులో ఉంది. ఇటీవల కాలంలో కుక్కకాటుకు గురైన బాధితులు తరుచుగా వస్తున్నారు. ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేస్తున్నాం. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

– డాక్టర్ అనిల్‌కుమార్, చిలుకూరు పీహెచ్‌సీ

ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు


హుజూర్‌నగర్‌రూరల్ : విజేతలకు ఎల్‌ఈడీ టీవీ అందజేస్తున్న నిర్వాహకులు

మునగాల : సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలో మంగళ, బుధవారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. మండల కేంద్రంలో అమ్మ– నాన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాళ్లబావి సెంటర్, హరిజన కాలనీలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్ఐ బి.ప్రవీణ్‌కుమార్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కలకోవలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. తాడువాయిలో కాంగ్రెస్ నాయకుడు చిర్రా సైదులు జ్ఞాపకార్థం కాంగ్రెస్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొలిశెట్టి బుచ్చిపాపయ్య చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కొక్కిరేణిలో సీపీఎం ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించి మహిళలకు పార్టీ రాష్ట్ర నాయకురాలు మల్లు లక్ష్మి బహుమతులు అందజేశారు.

హుజూర్‌నగర్ : పట్టణంలోని 2వ వార్డులో కాంగ్రెస్ నాయకుడు కోడి జ్యోతి ఉపేందర్ యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా దక్షిణ మధ్య రైల్వే బోర్డు మాజీ మెంబర్ యరగాని నాగన్నగౌడ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు తన్నీరు మల్లికార్జున రావు, ఎస్ఐ ముత్తయ్య హాజరై విజేతలకు పట్టు చీరలు, పాల్గొన్న అందరికీ కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ జక్కుల శంభయ్య, నాయకులు జక్కుల మల్లయ్య, క్రాంతి కుమార్, గురుమూర్తి, పి.రవి, కె.గోపి, జె.జయరాం, కె.మణికంఠ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

11 వ వార్డులో..

11వ వార్డులో కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి యడవెల్లి వీరబాబు, కందుకూరి రాము ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు దాతలు దేవరం అనిత ప్రభాకర్‌రెడ్డి, దేవరం రమా రామిరెడ్డి, బొడ్డు భారతమ్మ, మాజీ జెడ్పీటీసీ గల్లా వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ కస్తాల శ్రావణ్ కుమార్‌లతో కలిసి నాయకులు తన్నీరు మల్లికార్జునరావు, యరగాని నాగన్న గౌడ్, సాముల శివారెడ్డి, కోతి సంపత్ రెడ్డి, చిట్యాల అమర్ నాథ్‌రెడ్డి బహుమతులు అందజేశారు.

హుజూర్‌నగర్‌రూరల్ : సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మండలంలోని శ్రీనివాసపురంలో ఎన్ఆర్ఐ యలమంచిలి శ్రీనివాస్‌చౌదరి యూత్ ఆధ్వర్యంలో మంగళవారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి ఎల్‌ఈడీ టీవీ, ద్వితీయ బహుమతి బీరువా, తృతీయ బహుమతి గ్రైండర్‌ను బుధవారం అందజేశారు. కార్యక్రమంలో దాతలు కట్టా హరీష్, కట్టా గోపి, కట్టా సతీష్, శ్రీను, పాపారావు, వీరాంజనేయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

చిలుకూరు : మండల వ్యాప్తంగా మంగళవారం సంక్రాంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు ఇళ్ల ముందు రంగవల్లులు దిద్దారు. దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల కీర్తనలతో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. ఆచార్యులగూడెం గ్రామంలో నిర్వహించిన ముగ్గుల పోటీలను సీఐ మొగిలిచర్ల రవి ప్రారంభించారు. విజేతలకు కోదాడ రూరల్ సీఐ రజితారెడ్డి బహుమతులు అందజేశారు.


చిలుకూరు : ఆచార్యులగూడెంలో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు


హుజూర్‌నగర్ : విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎస్ఐ, నాయకులు

గోదాదేవి కల్యాణం


గోదాదేవి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

మునగాల : మండలంలోని నర్సింహాపురంలో గల శ్రీకోదండరామస్వామి ఆలయంలో మంగళవారం శ్రీగోదాదేవి –శ్రీకృష్ణ కల్యాణ మహోత్సవాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన సామాజిక సేవా కార్యకర్త డాక్టర్ వేమూరి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈ వేడుక నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

సీతారాంపురం కార్యదర్శి.. డీపీఓ కార్యాలయానికి అటాచ్

చిలుకూరు : మండలంలోని సీతారాంపురం గ్రామ పంచాయతీ కార్యదర్శి అవినాష్‌రెడ్డిని జిల్లా పంచాయతీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ బుధవారం డీపీఓ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. కార్యదర్శి అవినాష్‌రెడ్డి విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని, శ్మశాన వాటిక దగ్గర మట్టి తోలకం, పింఛన్ల మంజూరు, జీపీ పనుల విషయంలో అక్రమాలకు పాల్పడ్డారని, మద్యం తాగి కార్యాలయానికి వస్తున్నారని పది మందికిపైగా గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఇటీవల మూడుసార్లు ప్రజావాణిలో కలెక్టర్‌కు వేర్వేరుగా ఫిర్యాదులు అందజేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాలతో డిసెంబర్ 20న గ్రామ పంచాయతీ కార్యాలయంలో డీఎల్‌పీఓ యాదగిరి విచారణ చేసి కలెక్టర్‌కు నివేదిక అందించారు. కార్యదర్శిపై పలు ఆరోపణలు ఉన్నాయని అతడిని జిల్లా పంచాయతీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గరిడేపల్లి: మండలంలోని ఎల్బీనగర్ శివారులో బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకా రం.. సర్వారం మాజీ సర్పంచ్ గుమ్మడి అంజయ్య నేరేడుచర్ల నుంచి గరిడేపల్లి వైపు వస్తుండగా ఎల్బీనగర్ సమీపంలో బైక్ అదుపుతప్పి కిందపడిపోవడంతో గాయాలయ్యాయి. అతడిని 108 వాహనంలో మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గరిడేపల్లి : మండల కేంద్రంలోని ఎల్బీనగర్ రోడ్డు విస్తరణలో భాగంగా గరిడేపల్లి టౌన్ ఫీడర్ కింద కల్మలచెరువు రోడ్డులో 11కేవీ లైన్ విద్యుత్ స్తంభాలు మార్చుతున్నందున గురువారం మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ సాయికృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

నేటి నుంచి సాగు భూముల గుర్తింపు ప్రక్రియ ప్రారంభం

పాలకవీడు : రైతు భరోసా పథకం అమలుకు ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. సాగు యోగ్యత లేని భూములకు పెట్టుబడి సాయం దక్కదని ప్రభుత్వం స్పష్టం చేసింది. దీనిలో భాగంగా సాగు భూములను గుర్తించే పనికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, అందుకు గురువారం నుంచి సాగు భూములు, సాగుకు యోగ్యం కాని భూముల గుర్తింపు ప్రక్రియ ప్రారంభించనున్నట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ కమలాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా రెవెన్యూ గ్రామాల వారిగా 16వ తేదీ నుంచి 20వ తేదీ వరకు అర్హులైన రైతుల జాబితా తయారు చేయనున్నట్లు తెలిపారు.

పండ్ల వ్యాపారస్తులు ఐక్యంగా ఉండాలి

కోదాడరూరల్ : పండ్ల వ్యాపారస్తులు ఐక్యంగా ఉంటూ పరస్పర సహకారంతో ముందుకు వెళ్లాలని పండ్ల వ్యాపారస్తుల సంఘం గౌరవ అధ్యక్షుడు షేక్.బషీర్ అన్నారు. బుధవారం కోదాడ పట్టణంలో సంఘం సభ్యురాలు కుమార్తె వివాహం సందర్భంగా సంఘ నిధి నుంచి రూ.5 వేలను అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో అధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ షమీఉల్లా, సెక్రటరీ ఇస్మాయిల్, కోశాధికారి సుభాని, జానీ, జిలానీ, ఘన్ని, సలీమా ఉన్నారు.

ఘనంగా సంక్రాంతి వేడుకలు


హుజూర్‌నగర్‌లో గంగిరెద్దు విన్యాసం


మేళ్లచెరువులో ముగ్గులు వేస్తున్న మహిళలు

హుజూర్‌నగర్ : పట్టణంలో మంగళ, బుధవారాల్లో సంక్రాంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు తమ ఇళ్ల ముందు రంగురంగుల ముగ్గులు వేసి గొబ్బెమ్మలు పెట్టి అలంకరించారు. ప్రజలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పిండివంటలు చేసుకుని బంధుమిత్రులతో ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా వీధుల్లో నిర్వహించిన గంగిరెద్దుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

మోతె : మండల వ్యాప్తంగా మంగళవారం సంక్రాంతి సంబరాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాలలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

మేళ్లచెరువు : మండలంలో మంగళ, బుధవారం సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రజలు కొత్త ధాన్యంతో పాలు పొంగళ్లు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు ఇళ్ల ముందు ముగ్గులు వేసి రంగులు అద్దారు. ముగ్గులపై గొబ్బెమ్మలు పెట్టి పసుపు, కుంకుమ, పూలు వేసి పూజలు చేశారు. హరిదాసు కీర్తనలు, గంగిరెద్దుల విన్యాసాలు, బంధువుల రాకతో గ్రామాలు సందడిగా మారాయి.


గరిడేపల్లిలో ఇంటి ముందు ముగ్గు వేస్తున్న మహిళ

గరిడేపల్లి : మండల వ్యాప్తంగా మంగళవారం సంక్రాంతి వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు తమ ఇళ్ల ముందు రంగులతో ముగ్గులు వేశారు. దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

నడిగూడెం : మండల వ్యాప్తంగా మంగళవారం సంక్రాంతి వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఇళ్ల ముందు వివిధ రకాల రంగులతో మహిళలు ముగ్గులు వేసి, గొబ్బెమ్మలతో అలంకరించారు. ఆలయాలలో ప్రత్యేక పూజలు చేశారు.

సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి


అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ లక్ష్మీనర్సయ్య

పాలకవీడు : ప్రస్తుత సాంకేతిక యుగంలో ప్రతిఒక్కరూ సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ లక్ష్మీనర్సయ్య అన్నారు. బుధవారం పాలకవీడు మండలంలోని కోమటికుంట గ్రామంలో సైబర్ నేరాలపై కళా బృందంతో కలిసి ఆయన ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటర్‌నెట్‌ను అవసరం మేరకు వినియోగించుకోవాలన్నారు. మొబైల్ ఫోన్‌లో వచ్చే అనవసరమైన లింక్‌లు క్లిక్ చేయొద్దని, బ్యాంక్, ఏటీఎం, ఆధార్ లాంటి వ్యక్తిగత వివరాలను ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. సైబర్ మోసాల బారిన పడొద్దని తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, కళాకారుల బృందం, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైభవంగా వేణుగోపాలస్వామి గ్రామోత్సవం


హుజూర్‌నగర్‌రూరల్ : స్వామివార్ల గ్రామోత్సవం నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు


మఠంపల్లి : చౌటపల్లిలో శ్రీగోదాదేవి ఊరేగింపు నిర్వహిస్తున్న గ్రామ పెద్దలు, భక్తులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి దేవాలయంలో రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామివారి ఉత్సవ సమాప్తి కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అలయంలో ఉదయం సుప్రభాతసేవ, సేవాకాలం, ఆరాధన, మంగళాశాసనం, గోదాదేవికి పంచామృతాలతో అభిషేకం, అష్టోత్తర శతనామావళి, ఆరగింపు గావించారు. అనంతరం బూరుగడ్డ, మాచవరం గ్రామాల్లో రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ యరగాని గురవయ్య గౌడ్, ఈఓ లక్ష్మణరావు, ఆలయ అర్చకులు ముడుంబై హరీష్‌కుమార్‌చార్యులు, ధర్మకర్తలు, గ్రామ పెద్దలు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

చౌటపల్లిలో..

మఠంపల్లి : మండలంలోని చౌటపల్లిలో గల శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో శ్రీగోదాదేవికి సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారి గ్రామోత్సవం (ఊరేగింపు) గావించారు. అదేవిధంగా శివాలయంలోని శ్రీపార్వతీ రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయాల కమిటీల చైర్మన్లు సింగారపు సైదులు, బూషిపల్లి పిచ్చిరెడ్డి, ఈవో నాగెళ్ల శంభిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు కొండేటి రాంరెడ్డి, గ్రామ పెద్దలు నాగేశ్వరరావు సోమయ్య, ఎస్.రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ధనుర్మాస ఉత్సవాలు


హుజూర్‌నగర్ : పల్లకీ సేవలో ఆలయ ఈఓ, పూజారులు, భక్తులు


హుజూర్‌నగర్ : స్వామివారికి పవళింపు సేవ

హుజూర్‌నగర్ : పట్టణంలోని శ్రీవేణుగోపాల సీతారామచంద్రస్వామి ఆలయంలో బుధవారం ధనుర్మాస ఉత్సవాలు పవళింపు సేవతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గోదా రంగనాథస్వామి కల్యాణ మహోత్సవం అనంతరం పల్లకీలో ఉంచి పురవీధుల్లో ఊరేగింపు చేశారు. అన్నమయ్య భజన మండలి కళాకారుల భజన కీర్తనలు, మహిళలు పాడిన గంధము పూయరుగా పాట భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆలయ ఈఓ, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

శ్రీవారికి పవళింపు సేవ


మేళ్లచెరువు: పవళింపు సేవ నిర్వహిస్తున్న అర్చకులు

మేళ్లచెరువు : ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని శ్రీగోదా భూనీళా సమేత శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం సందర్భంగా మంగళవారం రాత్రి స్వామివారికి పవళింపు సేవ నిర్వహించారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సంక్రాంతి క్రీడా పోటీలు


హుజూర్‌నగర్ : బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభిస్తున్న నిర్వాహకులు


చిలుకూరు : విజేతలకు బహుమతులు అందజేస్తున్న దాత, నిర్వాహకులు

చిలుకూరు : సంక్రాంతి పండుగ సందర్భంగా మండల కేంద్రంలో చిలుకూరు కబడ్డీ యూత్ ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా నిర్వహించిన తెలుగు రాష్ట్రాల కబడ్డీ పోటీలు మంగళవారం అర్ధరాత్రి ముగిశాయి. పోటీల్లో మొదటి బహుమతి కల్లూరు (నేరేడుచర్ల మండలం), ద్వితీయ బహుమతి బరాఖత్‌గూడెం (మునగాల మండలం), తృతీయ బహుమతి (చెరువుమాధారం, ఖమ్మం జిల్లా), నాల్గొవ బహుమతి చిలుకూరు జట్టు, ఐదవ బహుమతి గణపారం జట్టు, ఆరో బహుమతి చిలుకూరు కమిటీ టీమ్ గెలుపొందాయి. విజేతలకు నిర్వాహకులు, దాతలు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో క్రీడల నిర్వాహకులు కొండా ఉదయ్, కొండా వినయ్, ముక్కా నవీన్, అమరగాని లింగరాజు, ప్రభాకర్, సాయి, మనోహర్, నవీన్, అశోక్, సురేష్, శివ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ పోటీలు..

హుజూర్‌నగర్ : సంక్రాంతి పండుగ సందర్భంగా హుజూర్‌నగర్‌లోని గోవిందాపురంలో అంబేద్కర్ లయన్ యూత్, మహాత్మా జ్యోతిరావు పూలే సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన బ్యాడ్మింటన్ పోటీలు బుధవారం ముగిశాయి. ఈ పోటీల్లో మొత్తం 8 టీమ్‌లు పాల్గొన్నాయి. మొదటి బహుమతి బి.వినోద్, జి.వీరబాబు, ద్వితీయ బహుమతి పి.ధనంజయ్, బి.రాజు టీం గెలుపొందారు. విజేతలకు కౌన్సిలర్ సీహెచ్ సౌజన్య, ఎస్ఐ పి.శ్రావణ్ కుమార్ బహుమతులు అందజేశారు. క్రీడల కమిటీ కన్వీనర్, నిర్వాహకులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

నడిగూడెం : క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందని స్థానిక ఎస్ఐ జి.అజయ్‌కుమార్ అన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని బుధవారం మండల కేంద్రంలో ఎలుగూరి యువసేన ఆధ్వర్యంలో నడిగూడెం, మునగాల మండలాల స్థాయిలో నిర్వహిస్తున్న వాలీబాల్, షాట్‌పుట్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు గుండు శ్రీనివాస్, దున్నా శ్రీనివాస్, ఏపూరి సుధీర్, పల్లపు శ్రీనివాస్, వల్లెపు శ్రీనివాస్, మేకల గంగరాజు, దున్నా ప్రవీణ్, గుంజ తిరుమలేష్, నిర్వాహకులు ఎలుగూరి కిరణ్, సతీష్, నాగేశ్వరరావు, ప్రకాష్, రమేష్, ఇంతియాజ్ పాల్గొన్నారు.


మఠంపల్లి : మంచ్యాతండాలో ట్రాక్టర్ రివర్స్ పోటీలు ప్రారంభిస్తున్న నిర్వాహకులు

క్రీడా పోటీలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయి

కోదాడరూరల్ : క్రీడా పోటీలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని కాంగ్రెస్ పార్టీ నాయకుడు మేకపోతుల సత్యనారాయణ అన్నారు. మంగళవారం కోదాడ పట్టణ పరిధిలోని లక్ష్మీపురంలో సంక్రాంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో వెంకట్, మీగడ కిరణ్, సురేష్, జంగాల కృష్ణయ్య, పరశురాం తదితరులు ఉన్నారు.

మంచ్యాతండాలో ట్రాక్టర్ రివర్స్ పోటీలు

మఠంపల్లి : మండలంలోని మంచ్యాతండాలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా మంగళవారం ట్రాక్టర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ట్రాక్టర్ రివర్స్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ట్రాక్టర్ యూనియన్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు రూపావత్ జబ్బానాయక్, సపావత్ శంకర్‌నాయక్, మాళోతు భాస్కర్‌నాయక్, కిషన్, బాబు, భిక్ష్యా, నాగా, రవీందర్, రంగా, శివ, రాజా, సుమన్, చిన్నా, అనేశ్వర్, ఇస్రా, సైదా పాల్గొన్నారు.


నడిగూడెం : వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్ఐ అజయ్‌కుమార్


కోదాడరూరల్ : లక్ష్మీపురంలో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న మేకపోతుల సత్యనారాయణ

నేడు శత వసంతాల వేడుక

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని ఆర్‌సీఎం చర్చిలో గురువారం శత వసంతాల వేడుక నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా నూతన గర్భగుడి పునఃప్రారంభం, సమష్టి దివ్య బలిపూజ, ప్రార్థనలు చేయనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం అన్న ప్రసాద వితరణ ఉంటుందని తెలిపారు.

బీఆర్‌ఎస్ నాయకుల అరెస్టు

నడిగూడెం : హుజూరాబాద్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అరెస్టుకు నిరసనగా, ఆయనకు మద్దతుగా నడిగూడెం మండలం నుంచి కరీంనగర్‌కు మంగళవారం తరలివెళ్తున్న బీఆర్‌ఎస్ నాయకులను స్థానిక పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. అరెస్టయిన వారిలో మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ.జలీల్, నాయకులు కాసాని సతీష్, దున్న రవి, ఎస్‌కె.మౌలానా, మేకల వీరబాబు, బడుగుల వెంకటేశం, పోలంపల్లి శ్రీకాంత్ ఉన్నారు.

అనాథ మహిళ మృతదేహానికి అంత్యక్రియలు

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రిలో కొన్నిరోజుల నుంచి చికిత్స పొందుతున్న ఓ అనాథ మహిళ మంగళవారం మృతిచెందింది. ఆమెకు ఎవరూ లేకపోవడంతో పోలీసుల ఆదేశాల మేరకు ఉత్తమ్ అన్న యూత్ ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు. యూత్ సభ్యులను పలువురు అభినందించారు.